# ఇన్లాండ్ లెటర్ కథలు

## టాలెంట్

"రావయ్యా... డైరెక్టరూ...నీ కోసమే చూస్తున్నా..!"ఆ ఏ.సి.గదిలో నిశ్శబ్దాన్ని బద్దలు చేస్తూ మోగింది నిర్మాత కనకారావ్ గొంతు.

"అవునూ... ఈ పిల్లెవరూ?" డైరెక్టర్‌తో పాటు వచ్చిన అమ్మాయి వంక అనుమానంగా చూస్తూ అడిగాడు.

"మన కొత్త సినిమాలో హీరోయిన్ ఈవిడే" డైరక్టర్ చెప్పేలోగానే "నమస్తే సార్.." అంది ఆ అమ్మాయ్.

చిల్ల పెంకు పెట్టి.. గచ్చు మీద గీకినట్టు వినబడింది నిర్మాతకి.

ఆ తర్వాత నిర్మాతకీ, డైరెక్టర్ కీ మధ్యన సంభాషణ ఇలా సాగింది...

ని:- అది కాదయ్యా! ఆ అమ్మాయి గొంతు అంత బాలేనట్టుంది.."

డై:- దాందేముంది సార్..ఈ రోజుల్లో సొంత గొంతుతో పనేముందీ...డబ్బింగ్ చెప్పిద్దాం.

ని:- అవుననుకో...అమ్మాయి రంగు కూడా ...?

డై:- రంగుదేముంది సార్... ఆ మాటకొస్తే...రేఖ, రోజా, ఆమని వీళ్ళంతా నల్లగా ఉన్నా ఇండస్ట్రీని దున్నేయట్లేదూ?

ని:- అమ్మాయి స్ట్రక్చర్ కూడా అంతంత మాత్రమే.." నెమ్మదిగా డైరక్టర్ చెవిలో అన్నాడు.

డై:- మగాళ్ళనే ఆడాళ్ళుగా మారుస్తోన్న మేకప్‌మెన్‌లు ఉన్నారు సార్... మన చేతిలో...పేడింగ్స్ పెట్టి కవర్ చేద్దాం సార్.

ని:- అమ్మాయి ముఖం కూడా అంత ఎట్రాక్టివ్‌గా లేదయ్యా...

డై:- ఈ రోజుల్లో హీరోయిన్స్‌కి ముఖంతో పనేంటి సార్, టాలెంటుండాలి గానీ.. మీరు ఊ అనండి... మిగతా కథ నేను నడిపిస్తా.

ఇంతలో ఆ అమ్మాయి మరోసారి



గొంతు విప్పింది.."అవును సార్..ఈయన రాత్రంతా నా టాలెంట్ చూసాకే మీ దగ్గర.. తీసుకొచ్చారు"

అస్సలు విషయం....వినయంగా చెప్పేసింది.

జి.వి.ఎస్.యన్.రావ్., కొమ్మాది.

## ఉపకారం

మధ్యాహ్న సమయం. గంగన్న, అతని పరివారం రోడ్డు పక్కనున్న చెట్టు కింద కూర్చోని భోజనం చేస్తున్నారు. అక్కడ రోడ్డు పని చేయడానికి వచ్చిన పది కుటుంటాలలో గంగన్న కుటుంబం ఒకటి. రోడ్డు ప్రక్కన కాంట్రాక్టర్ తెచ్చిపెట్టిన కంకర కుప్పలను రోడ్డు పైన పరచి పెట్టడం వాళ్ళ పని.

ఇంతలో ఒక వృద్దుడు తన కుడి చేతిలో ఒక కర్ర సహాయంతో నడుచుకుంటూ గంగన్న వాళ్ళు కూర్చున్న చెట్టు దగ్గరికి వచ్చాడు. ఆ వృద్దుడు గంగన్న భార్యనుద్దేశించి "అమ్మా ఆకలిగా ఉంది. నా దగ్గర కొంచెం అన్నం ఉంది. కాస్త కూర వేస్తే అన్నం తింటాను" అంటూ తన చేతిలో ఉన్న గుడ్డ మూటను చూపించాడు. ఆమె వృద్దుడనే కనికారం కూడా వేకుండా "కూర లేదు గీరా లేదు పొమ్మని"ఈసడించుకుంది. ఆ వృద్దుడు కదలకుండా అలాగే నిలబడి ఉండడం చూసిన గంగన్న కోపంతో తిడుతూ తన పక్కనున్న కర్రను ఝులిపించి అతన్ని అక్కడి నుంచి వెళ్ళి పొమ్మని గద్దించాడు. అదంతా దూరం నుంచి గమనిస్తున్న ఆ రోడ్డు సూపర్‌వైజర్ కిషోర్ నిస్సహాయస్థితిలో ఉన్న ఆ వృద్దున్ని తన వద్దకు రమ్మని సైగ చేసాడు. తన దగ్గరున్న కూర, చట్నీ, ఒక చపాతి అతనికిచ్చాడు. ఆ వృద్దుడు కృతజ్ఞతా భావంతో నమస్కరించి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

పదేళ్ళ వయస్సున్న అమ్మాయి, గంగన్న కూతురు కంకర రాళ్ళను గంపలో నింపుతుండే ఆమె తల్లి ఆ కంకరను తీసుకెళ్లి రోడ్డు పీద పరుస్తున్నది. ఇంతలో కంకర రాళ్ళ అడుగున కాపురముంటున్న ఒక పెద్ద తేలు ఆ అమ్మాయి చేతి మీద కాటేసింది. ఆమె మంటకు తాళ లేక లబోదిబోమంటూ ఏడవడం మొదలుపెట్టింది. ఆమె కేకలు విని అక్కడ పని చేస్తున్న వారంతా పరిగెత్తుకు వచ్చారు. ఒకరు ఆమె చేతికి విషం పైకెళ్ళకుండా కట్టుకట్టారు. ఇంకొకరు ఆ తేలును వేదికి పట్టి చంపేసారు. ఇలా ఎన్ని చేసినా ఆమె మంట మాత్రం తగ్గలేదు. రోడ్డు రోలర్ డ్రైవరుకు సూచనలిస్తున్న కిషోర్ కూడా అక్కడికి చేరుకున్నాడు. మంటను భరించలేక ఆ అమ్మాయి నేల మీద పొర్లుతున్నది. ఆ దృశ్యం చూసి కిషోర్ హృదయం ద్రవించుకుపోయింది. గంగన్నకు ఎన్నో సార్లు చెప్పాడు. అంత చిన్న అమ్మాయి చేత పని చేయించవద్దని మందలించాడు. కాని పిల్లా పెద్దా అందరం పని చేస్తే గాని పూట గడవదు బాబూ అంటూ ఆమె చేత పని చేయిస్తూనే ఉన్నాడు. ఇంతలో ఆ వృద్దుడు అక్కడికి వచ్చాడు. విషయం తెలుసుకొని అక్కడ ఉన్న వాళ్ళను పక్కకు జరగమని సైగ చేసాడు. నేల మీద కూర్చొని తన చినిగిపోయిన అంగీ లోపలి జేబులోంచి ఒక సంచిని తీసాడు. అందులోంచి ఒక నల్ల రాయిని తీసి తేలు కుట్టిన చోట అదిమి పెట్టాడు. అయిదు నిమిషాల తరువాత ఆ రాయిని తీసి చెంబులో నీళ్ళు తెప్పించి అందులో కడిగి తన సంచిలో వేసుకున్నాడు. ఆ రాయి అమ్మాయి శరీరంలోని విషాన్ని లాగేసింది. ఆమె మెల్లిమెల్లిగా మామూలు స్థితికి వచ్చింది. తన బిడ్డను కాపాడిన వృద్దునికి గంగన్న దంపతులు చేతులెత్తి నమస్కరించారు. అంతకు ముందు రోజు అతన్ని తిట్టినందుకు చింతించారు.

అతను చేసిన సహాయానికి కిషోర్ సంతోషపడి అతనికి ఒక పది రూపాయల నోటు ఇవ్వబోయాడు. కాని చేసిన ఉపకారానికి ప్రతిఫలం ఆశించని ఆ వృద్దుడు డబ్బును వద్దని వారించి తన చేతి కర్ర సహాయంతో ముందుకు సాగిపోయాడు.

– కె.మల్లేశం,మెదక్.